సామాజిక చైతన్యానికి అందమైన పిలుపు సన్నపరెడ్డి వెంకటరామిరెడ్డి కవిత్వం

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తెలుగు సాహిత్యరంగంలో గ్రామీణ జీవన సౌందర్యాన్ని, రైతు మనుగడను, సామాన్య మనిషి ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించిన ప్రముఖ రచయితగా నిలిచారు. 1963 ఫిబ్రవరి 16న వైఎస్ఆర్ కడప జిల్లాలోని శ్రీ అవధూత కాశినాయన మండలం బాలరాజుపల్లె గ్రామంలో సన్నపురెడ్డి చెన్నమ్మ, లక్ష్మిరెడ్డి దంపతులకు జన్మించిన వీరు సాధారణ రైతు కుటుంబంలో పెరిగి, గ్రామీణ జీవనానుభవాలను లోతుగా గ్రహించారు. బి.ఎస్సీ., బి.ఎడ్. విద్యలు అభ్యసించి 1989 నుండి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ, విద్యాబోధనతో పాటు సాహిత్య సృష్టిని సమన్వయ పరిచారు. ఉపాధ్యాయ వృత్తి ఆయన రచనలకు సామాజిక బాధ్యతను, విలువల పట్ల నిబద్ధతను అందించింది.

1987 నుంచే కథలు, కవితలు, నవలలు రచించడం ప్రారంభించిన వీరి రచనల్లో గ్రామీణ వాస్తవికత ప్రధాన స్వరంగా వినిపిస్తుంది. రైతు జీవితం, ప్రకృతి ఆధారిత జీవన విధానం, కష్టనష్టాలు, కుటుంబ సంబంధాల సున్నితత్వం, సామాజిక అసమానతలు వంటి అంశాలు ఆయన సాహిత్యంలో కేంద్రీయ స్థానం పొందాయి. భాష సరళమైనదైనా భావసంపద గాఢంగా ఉంటుంది. అలంకారాల కంటే అనుభవసత్యాన్ని ప్రధానంగా చూపించడం వీరి ప్రత్యేకత. అందుకే వీరు రచనలు పాఠకుల్లో సహజత్వానుభూతిని కలిగిస్తాయి. ఇప్పటివరకు తొమ్మిది నవలలు, మూడు కథా సంపుటాలు, ఒక కవితా సంపుటి ప్రచురించారు. 'కాడి', 'పాండవబీడు', 'పాలెగత్తె', 'తోలుబొమ్మలాట', 'చినుకుల సవ్వడి', 'ఒక్క వాన చాలు', 'మబ్బులు వాలని నేల', 'ఒంటరి', 'కొండపొలం' వంటి నవలలు వివిధ నవలల పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించాయి. ముఖ్యంగా 'కొండపొలం' నవల 2019 తానా నవలల పోటీలో అత్యుత్తమ పురస్కారం పొందడమే కాకుండా, అదే పేరుతో సినిమా రూపంలో వెలుగుచూసింది.

ముఖ్యంగా వీరి రచనలకు గాను, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం అందుకోవడం ఆయన రచనల విలువను తెలియజేస్తుంది. అదనంగా 'చాసో', 'రావిశాస్త్రి', కొండేపూడి శ్రీనివాసరావు, రావూరి భరద్వాజ స్మారక పురస్కారాలు వంటి గౌరవాలు ఆయన సాహిత్య కృషికి గుర్తింపుగా నిలిచాయి. 'అమృతలత జీవన సాఫల్య పురస్కారం', 'కేతు విశ్వనాథరెడ్డి జీవన సాఫల్య పురస్కారం' అందుకోవడం ఆయన సుదీర్ఘ సాహిత్య ప్రయాణానికి సముచితమైన మన్ననగా చెప్పవచ్చు. ఇన్ని ప్రక్రియల్లో ఎంతో సుప్రసిద్ధ స్థానాన్ని పొందిన వీరు కవిగా కూడా అత్యుతన్నతంగా తనను తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా. కవిగా 'బడి' అనే కవితా సంపుటి ద్వారా విద్యా వ్యవస్థ, బాల్య ప్రపంచం, గ్రామీణ భావజాలాన్ని ఆవిష్కరించారు. వర్షం, పొలం, మట్టి, చెట్లు ఇవి కేవలం నేపథ్య అంశాలు కాదు; పాత్రల భావోద్వేగాలకు ప్రతీకలు. "బడి" కవితలో "బడి" ఒక భవనం మాత్రమే కాదు, జీవంతో నిండిన ప్రపంచంగా చిత్రీకరించబడింది. గంట మోగినప్పుడల్లా బడి చేత దీపాలు పట్టుకున్న చుక్కలతో నిండిన పగటి ఆకాశంలా మారుతుందనడం ఎంతో అందమైన రూపకం. ఇక్కడ విద్యార్థులనే ఆ చుక్కలుగా ఊహించారు. వారి రాకతో బడి ప్రకాశిస్తుంది, సజీవంగా మారుతుంది. "బడి ముంగిలి పావురాలు వాలిన దేవాలయ ప్రాంగణంలా ముస్తాబవుతోంది" అన్న పాదం బడిని పవిత్ర స్థలంగా చూపిస్తుంది. పిల్లలు పావురాల్లా చేరి గుమిగూడితే అది దేవాలయ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. ఇక్కడ విద్యను ఒక ఆధ్యాత్మిక ప్రక్రియగా, పూజ్యమైనదిగా కవి సూచిస్తున్నాడు. కానీ గంట మోగని రాత్రిళ్లు బడి "నడి సముద్రాన దీపం లేని ఒంటరి నావ"లా ఉంటుంది. పిల్లలు లేని బడి వెలితిగా, నిర్జీవంగా మారుతుంది. జీవం పిల్లలతోనే ఉందని ఈ రూపకం తెలియజేస్తుంది.

"సెలవులు మంచులా దినాల్ని కప్పినప్పుడంతా ధ్రువపు ఎలుగవుతుంది బడి" అన్న వాక్యం మరింత భావోద్వేగభరితం. సెలవుల సమయంలో పిల్లల హడావుడి లేక బడి శూన్యంగా, కదలికలేని స్థితిలోకి వెళ్తుంది. ధ్రువప్రాంతంలో మంచులో కప్పబడి నిద్రలోకి జారిపోయిన ఎలుగుబంటిలా అది మౌనంగా ఉంటుంది. మొత్తంగా ఈ కవిత బడిని జీవంగా, భావాలతో కూడిన ప్రపంచంగా చూపిస్తూ పిల్లలతోనే దానికి ప్రాణం వస్తుందని హృదయానికి హత్తుకునేలా చెబుతారు..

మరొక చోట సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రచించిన "నేను--తను" కవిత దాంపత్య సంబంధాలలో అభిప్రాయ భేదాల వల్ల ఉత్పన్నమయ్యే అంతర్మథనాన్ని, అహంకార--ఆత్మగౌరవాల మధ్య జరిగే సూక్ష్మ సంగ్రామాన్ని అత్యంత సున్నితంగా ప్రతిబింబిస్తుంది. ఈ కవితలో బాహ్య సంఘటనల కంటే అంతర్ముఖ అనుభూతులే ప్రధానంగా నిలుస్తాయి. ఒక చిన్న అభిప్రాయ భేదం "పెరిల్లున విరిగినప్పుడు" ఇద్దరూ "చెరో ధ్రువం వైపు విసిరేయబడటం" అనే రూపకం, సంబంధాల్లో విభేదాలు ఎంత త్వరగా దూరాన్ని సృష్టిస్తాయో తెలుపుతుంది. భౌతికంగా దగ్గరగా ఉన్నప్పటికీ, భావోద్వేగ పరంగా యోజనాల దూరం ఏర్పడటం కవి బలంగా చూపించారు. "నిషిద్ధ వర్ణచిత్రం"గా ఆమె ముఖం కనిపించడం, మనసులోని విదూరతను ప్రతీకాత్మకంగా తెలియజేస్తుంది. ఈ కవితలో 'అహం' ప్రధాన పాత్రధారి. "ఉల్లిపొరై మామధ్య లేచిన భేదభావం" అనే ఉపమానం, చిన్న కారణం ఎంత పొరలుగా పెరుగుతుందో సూచిస్తుంది. తన అహంకారానికి "ఉక్కుపూత పూయడం" అనే భావన ద్వారా, మనిషి తన గర్వాన్ని కాపాడుకోవడానికి చేసే అంతర్మథనం వ్యక్తమవుతుంది. మధ్యలో "మౌనంగా పడుకున్న పాప" దాంపత్య జీవితానికి ప్రతీకగా, లేదా వారి ప్రేమకు సాక్షిగా నిలుస్తుంది. ఆ పాప ఉనికి, విభేదాల మధ్య ఉన్న మౌన బంధాన్ని గుర్తుచేస్తుంది.

ఈ కవితలో పురుషత్వం--దాసిత్వం, అబలత్వం--ఆధిపత్యం వంటి భావాలు మనోవైజ్ఞానిక స్థాయిలో పరిశీలించబడతాయి. "నాలోని పురుషత్వం శంకిస్తుంటుంది" అనే వాక్యం, లింగాధారిత ఆత్మగౌరవం ఎంత సున్నితమైందో తెలియజేస్తుంది. ఇక్కడ సమస్య అభిప్రాయం కాదు; ఆ విభేద క్షణాలు మెదడులో "వేరుపురుగులవ్వడం" అనే బలమైన ప్రతీక ద్వారా, ఆలోచనలు ఎలా విస్తరిస్తాయో చూపించారు. ఆమె మౌనం క్రమంగా శక్తిగా మారుతుంది. మొదట వీరికి అది

బలహీనతగా కనిపించినా, చివరికి అదే మౌనం అతని అహాన్ని కరిగించే శక్తిగా మారుతుంది. "చలిగాలి అలై నా ఒంటరితనాన్ని స్పర్శిస్తే జలదరించి వర్షించాలని ఉంటుంది" అనే పంక్తి, వీరి అంతర్మథనం కరిగే దశను సూచిస్తుంది.

చివరి భాగంలో కవిత భావోద్వేగ శిఖరానికి చేరుతుంది. "మనోగవాక్షలలోంచి దూకివచ్చిన చంద్రబింబం కన్నీటిబిందువై" మారడం ద్వారా, భావోద్వేగం కరుణగా పరిణమిస్తుంది. ఆమెలోని మాతృత్వం నదిలా కదలడం, ఆమెను కేవలం భార్యగా కాకుండా జీవన మూలశక్తిగా ప్రతిష్ఠిస్తుంది. చివరికి "నేనే ఆమెనై అబలనై పసిపాపనై గారాలు పోతాను" అనే ముగింపు, అహం కరిగి ఏకత్వం సాధించిన స్థితిని తెలియజేస్తుంది. ఇందులో రూపకాల సమృద్ధి, మనోవైజ్ఞానిక లోతు, భావోద్వేగ పరిణామ క్రమం ప్రధాన బలాలు. దాంపత్య జీవితంలోని చిన్న విభేదాలు ఎంత లోతైన అంతర్మథనానికి దారితీస్తాయో, అహంకారాన్ని కరిగించేది చివరికి ప్రేమే అన్న సందేశాన్ని కవి సున్నితంగా ఆవిష్కరించారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత అనుభూతి కవిత మాత్రమే కాక, మానవ సంబంధాల అంతర్లీన సత్యాన్ని ప్రతిబింబించే లోతైన కవితగా నిలుస్తుంది.

కవిగా వీరు దాదాపు 60 కవితలకు పైగా రచించారు. వీరి కవిత్వం తలుచుకోగానే నాకు గుర్తుకువచ్చేది "కళ్ళను చనుబాలతో కడగండి" అనే కవిత. వందల కథలు. అత్యుత్తమ నవలలు రచించిన వీరి కలం కవిత్వంలో కూడా ఇంత పదునుగా వుండటం ఒకింత ఆశ్చర్యం కలిగించింది. నిజానికి ఏ సాహితీవేత్తకైనా ప్రవేశం అన్నింటిలో వున్నా ఒక్క ప్రక్రియలో మాత్రం ప్రావీణ్యత కనిపిస్తుంది. కానీ వీరి కలానికి మాత్రం ఏ ప్రక్రియ అయినా అద్భుతంగా వ్యక్తికరించే శక్తి వుంది అనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అలా అనిపించిన కవిత ఇది. ఈ కవిత ప్రకృతి నాశనం మీద గాఢమైన హెచ్చరికగా నిలుస్తుంది. చెట్టు మనిషిని చూసి వణికిపోతుందని చెప్పడం ద్వారా కవి ప్రకృతిని జీవిగా చూపించాడు. మనిషి తనే పెంచుకున్న కొమ్మనే గొడ్డలిగా మార్చి నరికే దృశ్యం అతని స్వార్థానికి ప్రతీక. ఇది అభివృద్ధి పేరుతో ప్రకృతినే ఆయుధంగా మార్చుకుని దాన్నే నాశనం చేస్తున్న మనిషి పరిస్థితిని సూచిస్తుంది. ఇసుక తిన్నెల వక్షాలను రాబందుల్లా పీక్కుతినే రాక్షస హస్తాల దాడి అన్న పాదంలో అక్రమ తవ్వకాలు, ప్రకృతి వనరుల దోపిడీ స్పష్టంగా కనిపిస్తుంది. ప్రకృతిని తల్లిగా భావిస్తే, ఆమె వక్షాలను చీల్చి తీసే దృశ్యం ఎంత భయానకమో కవి ఆవేదనగా వ్యక్తం చేశాడు. కొండలు పగిలి ఏడుస్తున్నాయనడం ద్వారా అభివృద్ధి పేరిట కొండలను కంకరగా మార్చే మానవ చర్యలపై వ్యతిరేక స్వరం వినిపిస్తుంది.

"అమ్మా నాన్నల్లారా" అని ప్రారంభమయ్యే భాగంలో కవి సమాజాన్ని నేరుగా ఉద్దేశించాడు. పిల్లల పెంపకంలోనే అంతులేని ఆకలిని, అధికాసక్తిని నాటుతున్నామని చెబుతూ పోషణ శైలిని మార్చమని విజ్ఞప్తి చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచే విలువలు, పరిమితి, ప్రకృతి పట్ల బాధ్యత నేర్పాలని సూచిస్తున్నాడు. "కళ్ళను చనుబాలతో శుభ్రంగా కడగండి" అన్న పాదం నిర్మలమైన దృష్టిని, స్వార్థరహిత మనసును సూచిస్తుంది. తల్లిపాలు పవిత్రతకు ప్రతీకగా నిలిచి, కొత్త తరం స్వచ్ఛమైన దృష్టితో ప్రపంచాన్ని చూడాలని కవి ఆశయాన్ని తెలియజేస్తుంది. అలాగే 'ప్రాణవాయువు" మరియు 'తూనీగ' కవితలు కూడా అంతే స్థాయిలో వుండటం గమనార్హం.

రాయలసీమ ప్రాంతంలో రచనాప్రక్రియల్లో ఇపుడున్న తరంలో బలమైన గొంతు వెంకటరామిరెడ్డి గారిది. సామాజిక చలన సూత్రాల్ని పట్టుకుని దశ, దిశను తెలియజెప్పే సాహిత్యం వీరిది. "పక్షులన్నా / రెక్కలున్నా / అవి రెండు రెక్కలుగా ఎగిరే పద్యమన్నా / నాకెంతో ఇష్టం" అని చెప్పినప్పుడు అది చాలా అందమైన కవితాత్మక భావవ్యక్తీకరణగా భావించాలి.

ఇక్కడ "పక్షులు" అంటే స్వేచ్ఛకు ప్రతీక. "రెక్కలు" అంటే ఆ స్వేచ్ఛను సాధించడానికి అవసరమైన శక్తి, సాధనం. "రెండు రెక్కలుగా ఎగిరే పద్యం" అన్నది చాలా గొప్ప రూపకం. ఒక పద్యం కూడా పక్షిలా ఎగరాలి అంటే అందులో రెండు బలమైన రెక్కలు ఉండాలి. భావం మరియు భాష, హృదయం మరియు ఆలోచన, సత్యం మరియు సౌందర్యం వంటి ద్వంద్వాలు ఆ పద్యాన్ని పైకి తీసుకెళ్తాయి. కవి ఇక్కడ పద్యాన్ని జీవంగా, పక్షిలా ఊహిస్తున్నాడు. నేలకే పరిమితమై ఉండే మాటలకన్నా, ఆకాశంలో విహరించే స్వేచ్ఛా పద్యం తనకు ఇష్టమని చెబుతున్నాడు. ఇది కేవలం ప్రకృతిపట్ల ప్రేమ కాదు, స్వేచ్ఛా భావాల పట్ల, విస్తృతమైన ఆలోచనల పట్ల ఉన్న ఆకర్షణను కూడా తెలియజేస్తుంది. ఈ వాక్యంలో స్వేచ్ఛ, సౌందర్యం, సమతుల్యత అనే మూడు భావాలు అందంగా కలిసిపోయాయి.

మరోచోట" మౌన ఘోష" కవిత చాలా హృదయవిదారకమైన బాల్య వాస్తవాన్ని చూపిస్తుంది. మాష్టారి ప్రశ్నకు జవాబుగా ఆ పిల్లవాడు మాటలతో కాదు, చేతులు చాచి నిలబడటం అతని మౌన నిరుపేద స్థితిని తెలియజేస్తుంది. అతను జవాబు తెలియక మౌనంగా ఉన్నాడా, లేక పరిస్థితులు అతన్ని అలా మౌనంగా మార్చేశాయా అన్న ప్రశ్న మనసులో తలెత్తుతుంది. "పెదాల రేకులు విప్పలేని వాడిన మొగ్గ" అన్న రూపకం అతని బాల్యాన్ని సూచిస్తుంది. ఇంకా వికసించని పువ్వులా, మాట్లాడలేని స్థితిలో ఉన్న చిన్నారి. "చిరిగిన మేఘవస్త్రం మాటున చిదిమిన ఆశ్రుకణం" అన్న పాదం అతని లోపలి బాధను, అణచివేతను చూపిస్తుంది. బయటకు మౌనం కనిపించినా లోపల కన్నీటి గాయాలు ఉన్నాయి. రూల్‌కర్రకు నిశ్శబ్దంగా అరచేతులను అప్పగించడం విద్యా వ్యవస్థలోని శారీరక శిక్షను సూచిస్తుంది. పిల్లవాడు ఎదురు తిరగడు; తన చేతుల్ని సమర్పిస్తాడు. ఇది అతని బలహీనత కాదు, పరిస్థితుల బలవంతం. "సెలవులు కూలి దినాలై" అన్న పాదం ఈ కవితలో అత్యంత కీలకం. ఇతర పిల్లలకు సెలవులు విశ్రాంతి అయితే, ఈ బాలుడికి అవి కూలి దినాలు. అతని అరచేతులపై ఉన్న బొబ్బలు శ్రమకు నిదర్శనం. అదే చేతులు పాఠశాలలో శిక్షకు గురవుతాయి. కూలి పనితో పుట్టిన బొబ్బలు, మాష్టారి కర్ర దెబ్బలతో మరింత నొప్పిగా మారతాయి. చివరి పాదంలో "ప్రశ్నార్థకాలవుతాయి" అన్నది గొప్ప భావవ్యక్తీకరణ. మాష్టారు అడిగిన ప్రశ్నలకు జవాబు తెలియక చేతులు చాచిన బాలుడు, తన గాయాలతోనే సమాజాన్ని ప్రశ్నిస్తున్నాడు. ఎందుకు అతని బాల్యం ఇలా శ్రమలో కరుగుతోంది? ఎందుకు విద్య అతనికి శిక్షలా మారుతోంది? అనే ప్రశ్నలను ఈ కవిత మన ముందుంచుతుంది. మొత్తంగా ఇది బాల కార్మికత్వం, పేదరికం, మరియు విద్యా వ్యవస్థలోని కఠినత్వంపై గాఢమైన సామాజిక విమర్శగా నిలుస్తుంది. ఇలాంటివి అనేక వీరి కలం ద్వారా వెలువడ్డాయి.

ముగింపుగా చెప్పాలంటే, ఈ కవితల్లో కనిపించే కవిత్వం గాఢమైన సామాజిక స్పృహతో, హృదయాన్ని కదిలించే సున్నితత్వంతో నిండి ఉంటుంది. ప్రకృతి నాశనం, బడి--బాల్యం, పేదరికం, బాల కార్మికత్వం వంటి అంశాలను వారు కేవలం వర్ణించరు; మన కళ్లముందు సజీవ దృశ్యాలుగా నిలబెడతారు. చెట్లు వణికిపోవడం, కొండలు ఏడవడం, బడి ఒంటరి నావగా మారడం, పిల్లవాడి అరచేతులు ప్రశ్నార్థకాలవడం వంటి రూపకాలు వారి భావవ్యక్తీకరణ శక్తిని తెలియజేస్తాయి.

వీరి కవిత్వంలో వ్యక్తీకరణ ప్రత్యేకంగా కనిపిస్తుంది. జడ వస్తువులకూ జీవం పోసి, పాఠకుడిలో అనుభూతిని రేకెత్తించడం వారి శైలికి ప్రధాన లక్షణం. అదే సమయంలో భాష సరళంగా, కానీ భావం లోతుగా ఉంటుంది. ప్రతి చిత్రం ఒక సామాజిక ప్రశ్నగా మారుతుంది; ప్రతి రూపకం ఒక హెచ్చరికగా నిలుస్తుంది. ఈ కవిత్వం చదివిన తర్వాత మనం కేవలం భావోద్వేగంతో మిగలము. ఆలోచనలో పడతాము. మన జీవిత విధానం, మన విలువలు, మన సమాజ నిర్మాణం అన్నీ ప్రశ్నించబడతాయి. అందుకే వారి కవిత్వం కేవలం సాహిత్యం కాదు, సామాజిక చైతన్యానికి పిలుపు.

- శైలజామిత్ర
9290900879

"ప్రపంచంలో ఏ భాషా విస్మరణకు గురికాకూడదు, మృతభాష కాకూడదు "

ప్రపంచ ప్రజలందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం శుభాకాంక్షలు అందిస్తున్నది. ఈ సమయంలో ప్రపంచంలో ఏ భాషా విస్మరణకు గురి కాకూడదనీ, ఏ భాషా మరణించకూడదనీ కోరుకుందాం. వ్యవహార భాషగా, విద్యా భాషగా, రాతభాషగా, పాలనా భాషగా ప్రతీ భాషా మనుగడ సాగించాలని ఆకాంక్షిద్దాం. "భాషాభిమానం నాకు కద్దని ఒట్టి గొప్పలు చెప్పుకోకోయి పూని నీ బిడ్డలకు అమ్మ భాషను నేర్పవోయి".



- ఆచార్య రాచపాళెం చంద్ర శేఖర్ రెడ్డి ,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత.

మాతృభాష మనకు సహజమైన సంభాషణ మార్గం. అది అత్యంత శక్తివంతమైనదీ కూడా. మనిషి మొదట తన మాతృభాషలోనే ఆలోచించాలి, మాట్లాడాలి, రాయాలి. మాతృభాష అతని స్వతంత్ర వ్యక్తిత్వానికి, తన అస్థిత్వానికి గొప్ప గుర్తు. ప్రపంచం ఒక గ్లోబల్ గ్రామంగా మారింది కాబట్టి, ఇతర భాషలను కూడా నేర్చుకోవడం మంచిదే. వివిధ దేశాల ప్రజలతో మెలగాల్సి ఉంటుంది. అయితే ఈ విశాల ప్రపంచంలో మన గుర్తింపును కాపాడేది మాతృభాషే. కొంతమంది స్వార్థపూరిత ఉద్దేశ్యాలతో మాతృభాషపై దాడి చేస్తారు. ఎందుకంటే మాతృభాషను బలహీనపరిస్తే, ప్రజలను సులభంగా అణచివేయవచ్చు.

- డాక్టర్ జెర్నైల్ సింగ్ ఆనంద్
పంజాబీ రచయిత

మాతృభాష ఒక జాతి సంస్కృతి, సంప్రదాయాల ఆత్మ. మన ఆలోచనలు, భావాలు సహజంగా వ్యక్తమయ్యేది మాతృభాష ద్వారానే. మాతృభాష దినోత్సవం మన భాషను ప్రేమించేందుకు, కాపాడేందుకు మనకు ప్రేరణ ఇస్తుంది. భాష నశిస్తే సంస్కృతి మరియు గుర్తింపు కూడా కోల్పోతాయి. అందువల్ల మాతృభాష సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రపంచ భాషలను నేర్చుకుంటూనే, మన స్వభాషను ప్రేమించి ప్రచారం చేయాలి.



- డాక్టర్ సిగ్మా
మలయాళం రచయిత్రి

మాతృభాష అంటే తల్లి తన బిడ్డను ముద్దుగా పిలిచే భాష. తల్లిలా మనసుకు హాయిగా అనిపించే భాషే మాతృభాష. చిన్నప్పటి నుంచే మనకు నేర్పబడే, జోలపాటలు పాడబడే భాషే మాతృభాష. నేను గుజరాతీని అని, నా మాతృభాష గుజరాతీ అని గర్వంగా చెబుతాను. ప్రపంచంలో మాట్లాడే 7159 భాషలకన్నా, నా దేశంలోనే మాట్లాడే 2011 భాషలకన్నా, నాకు నా మాతృభాష ఎంతో ప్రియమైనది. ఎందుకంటే అది నా భాష --- మధురమైనది, సరళమైనది, సంస్కృతం నుండి వచ్చినది, జాతీయ భాషకు సన్నిహితమైన సహోదరి. గుజరాత్‌కు వచ్చే ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా గుజరాతీని సులభంగా స్వీకరిస్తారు. ఎందుకంటే అది వెన్నలాగా మృదువుగా, చక్కెరలాగా తీయగా ఉంటుంది. మేము వెళ్లే మనిషికీ మళ్లీ రండి అని చెబుతాము. విడిపోతూ "మళ్లీ కలుద్దాం" అని శుభాకాంక్షలు తెలుపుతాము. ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, చిరస్థాయి సంబంధాలు ఉండాలని కోరుకుంటాము. నా మాతృభాష వైభవానికి అంతు లేదు. ఇంగ్లీషులో "మార్నింగ్" లేదా "డాన్" అనే ఒక్క మాట ఉంటే, మా భాషలో ఉదయానికి ఎన్నో పేర్లు ఉన్నాయి --- ప్రభాత, ఉష, పరొధ, ప్రాతఃకాలం ఇంకా మరెన్నో. అందుకే ప్రపంచంలోని 50 కంటే ఎక్కువ దేశాలలో నివసించే గుజరాతీలు ఎక్కడికి వెళ్లినా ఒక చిన్న గుజరాత్‌ను నిర్మిస్తారు. గుజరాతీ నా ప్రియభాష, నా అనుభూతుల భాష. గుజరాతీలో చూసిన నా కలలు నాకు నిజమవుతాయని అనిపిస్తుంది. ఎందుకంటే అవి తల్లి ఆశీర్వాదంలా అనిపిస్తాయి. నేను ఇంగ్లీషు ప్రధానాంశంతో బి.ఏ., ఎం.ఏ. చదివాను. అదే అంశంలో బి.ఎడ్ కూడా పూర్తిచేశాను. ఎన్నేళ్ల పాటు విదేశాలలో ఉండి పాఠశాలలో ఇంగ్లీషు బోధించాను. అయినా నా మాతృభాష స్థానం నా హృదయం నుండి కొంచెం కూడా తగ్గలేదు. నేను గర్వంగా గుజరాతీలో మాట్లాడుతాను, గుజరాతీలో రాస్తాను, గుజరాతీని నా ప్రతి శ్వాసలోనూ అనుభవిస్తాను. అది ఆలోచించగానే నా హృదయం ఆనందంతో నిండిపోతుంది ---

- గిరిమా గరేఖాన్
గుజరాతీ రచయిత్రి

ప్రపంచవ్యాప్తంగా 40% మంది విద్యార్థులకు తమకు బాగా అర్థమయ్యే మాతృ భాషలో విద్య అందడం లేదు. ముఖ్యంగా ఆదివాసీ, వలస, మైనారిటీ యువత ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే, విద్యా విధానాల్లోమాతృ భాష హై స్కూల్ వరకు తప్పనిసరిగా, కాలేజ్‌లో కావాలంటే బహుభాషా విద్యను ప్రధానంగా చేర్చాలి. ఇది అందరికీ సమాన అవకాశాలు, సమర్థమైన విద్య అందించడానికి సహాయపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాలు యువత, ఉపాధ్యాయులు, విధాన నిర్ణేతల మధ్య చర్చలకు అవకాశం కల్పిస్తున్నాయి. మంచి అనుభవాలను పంచుకోవడం, కార్యాచరణ చర్యలను ముందుకు తీసుకురావడం ద్వారా పాఠశాలల్లో సమాజాల్లో భాషా వైవిధ్యాన్ని బలపరుస్తున్నాయి.

- డాక్టర్ పెరుగు రామకృష్ణ
తెలుగు రచయిత

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మన మాతృభాష మహిమను స్మరించుకుందాం. భాష కేవలం అక్షరాల సమాహారం కాదు; అమ్మ లాలిపాటలో పుట్టిన అమృతధార. మన భావాలు, ఆలోచనలు, కలలకు స్పష్టమైన రూపం ఇచ్చేది మాతృభాషే. వేల ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యం నన్నయ నుంచి త్యాగరాజు వరకు సుసంపన్నంగా వికసించింది. ప్రపంచీకరణలో పరభాషలు నేర్చుకోవడం అవసరం అయినా, మాతృభాషను విస్మరించడం మూలాలను కోల్పోవడమే. ఆనందం, ఆవేదన వంటి సహజ అనుభూతులు కన్నతల్లి భాషలోనే పరిపూర్ణంగా వ్యక్తమవుతాయి. భాష బతికితేనే జాతి బతుకుతుంది. మన ఇంట్లో, నిత్యజీవితంలో తెలుగును గౌరవంగా మాట్లాడి, ఈ అక్షర వారసత్వాన్ని భావితరాలకు సగర్వంగా అందిద్దాం.

- లక్ష్మీ నారాయణ కొల్లి
తెలుగు రచయిత

ఒత్తిడి వద్దు ఆత్మవిశ్వాసమే హద్దు

(తెలంగాణ రాష్ట్రములో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల (ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు) సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దృష్టితో రాసిన కవిత)

విద్యార్థి ఒత్తిడి వద్దు
ఆత్మ విశ్వాసమే హద్దు
విజయమే నీ పద్దు
విద్యార్థి పోలికలు వద్దు
స్వయం పోటీయే ముద్దు
విద్యార్థి టెనేషన్ వద్దు
అటెన్షన్ ముద్దు
విద్యార్థి ఆందోళన వద్దు
ఆలోచనే ముద్దు
విద్యార్థి ఆలోచించు
విశ్లేషించు

విద్యార్థి స్పందించు
ఆశయాలను సాధించు
విద్యార్థి అధ్యయనం చేయు
అవగాహన పెంచుకో
విద్యార్థి అభ్యసనం అలవాటైతె
అనువర్తనం పరివర్తనమౌతది
విద్యార్థి విశ్లేషణ వివరణ విమర్శ విస్తృతమైతే
సమర్పణ సృజన సామర్థ్యాలు
ఇనుమడిస్తాయి

సమయ పాలన పాఠ్యాంశాలపై
సాధికారిత సత్ ఫలితాలిస్తాయి
విద్యార్థి షార్ట్ కట్స్ వద్దు స్మార్ట్ వర్క్ ముద్దు
సులభ సమాధాన ప్రశ్నల
ఎంపిక సమయపాలన
పరీక్షలో కలిగే ఫోబియాను
దూరం చేస్తాయి
కఠిన ప్రశ్నలకు జవాబు
రాసే విశ్వాసం ఏర్పడుతుంది
పరీక్షల్లో విజేతగా నిలుపుతుంది

విద్యార్థి సృజన సన్మార్గమైతె
విజయాలు సిద్ధిస్తాయి
విద్యార్థి విజయ సాధన కాంక్ష
నిరంతరం వెలిగే జ్యోతి కావాలి
సృజనాత్మకత పట్టుదల
పెట్టుబడి కావాలి
విద్యార్థి పరీకల్లో కాపీ తాత్కాలిక విజయం

జీవితంలో షార్ట్ కట్స్ వద్దు
జ్ఞానం శీలం జీవన సాఫల్యతకు మార్గం కావాలి

పిల్లలపై భారీ అంచనాలు వద్దు
నచ్చిన రంగాల్లో రాణించేట్లు విద్యార్థి
మనసును ఎరిగి టీచర్స్ బోధించాలి
ప్రోత్సహించడమే ముద్దు

విద్యార్థి మనోప్రశాంతత ఆత్మవిశ్వాసం
ప్రతిభా పాటవాలకు ఉద్దీపనం కావాలి

యావరేజే అద్భుతాలకు ఆలంబన కావాలి
విద్యార్థి ఆత్మన్యూనత విడనాడాలి

నైపుణ్యాభివృద్ధితో శ్రమయేవ జయతే జీవన
శైలి కావాలి
విద్యార్థి రాంకుల కొరకు
పరుగు వద్దు
రాణింపే మంత్రం కావాలి
పరనాసక్తే తంత్రం కావాలి
వివేచన విచక్షణ యంత్రం
కావాలి

సమయ పాలనతో స్వావలంభన
సమయాన్ని సృజనను సన్మార్గంలో పెడితే
అద్భుతాలు ఆవిష్కృతమౌతాయి

విద్యార్థి జీవిత కాల చక్రంలో వచ్చే
మార్పులను ప్రతిభను గుర్తిస్తే విజయాలు
రాజ్యమేలుతాయి

విద్యార్థి ఆన్లైన్ గేమ్స్
సోషల్ మీడియా వద్దు సోషలైజేషన్ హద్దు
పుస్తకాలకు దగ్గరగా గ్యాడ్జెట్స్ రహితంగా
ప్రతి ఇల్లు టెక్నాలజీ ఫ్రీ జోన్
కావాలి
గ్యాడ్జెట్ల బానిసత్వం వద్దు
టెక్నాలజీ ఉపవాసం ముద్దు
జీవితంలో ఉల్లాసం
ఉత్సాహం ఉప్పొంగాలి

మాతృబాషపై మమకారం
ప్రాంతీయ భాషపై ఆసక్తి
ప్రాచీన భాషలపై అభిమానం

భారతీయ సంస్కృతి చరిత్ర వారసత్వ
సంపదపై అవగాహన చైతన్యం పెంచుకొని
భారత జాతి ప్రతిభా ఔన్నత్యాన్ని
ప్రపంచానికి చాటాలి
విశ్వ విజేతలుగా నిలువాలి
జగతిన వెలుగులు నింపాలి

- నేదునూరి కనకయ్య
9440245771